# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం



యాదగిరిగుట్టలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మాఢ వీధులు సందడిగా మారాయి. ఎటుచూసినా భక్తులే దర్శనమిచ్చారు. కొండకింద కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించి పులకరించిపోయారు. ధర్మదర్శానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణపుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు స్వామివారి నిత్యోత్సవాలను వైభవంగా జరిపారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను వైభవంగా నిర్వహించారు. వ్రత మండపంలో జరిగిన సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో 1,311 మంది దంపతులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. కొండపైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి అర్చకులు, పురోహితులు అభిషేకాలు చేశారు. స్వామివారిని సుమారు రూ.40 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.64,67,273 ఆదాయం సమకూరిందని ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.



నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

# 8 నుంచి అర్వపల్లి దర్గా ఉర్సు

- రెండ్రోజులపాటు జరుగనున్న ఉత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలిరానున్న భక్తులు



విద్యుత్ కాంతుల్లో అర్వపల్లి దర్గా(ఫైల్)

అర్వపల్లి, డిసెంబర్ 3 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరొద్దీన్ బాబా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు ఘనంగా జరుగనున్నాయి. 8న సందల్ ఉర్సు జరుగనున్నది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు అర్వపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు మొదలై భక్తుల నడుమ రాత్రి 9 గంటలకు దర్గాకు చేరనున్నది. అనంతరం అర్ధరాత్రి కవ్వాలి కార్యక్రమం నిర్వహిస్తారు. మరుసటి రోజు సాయంత్రం దర్గాలో దీపాలు వెలిగిస్తారు. దాంతో ఉర్సు ఉత్సవాలు ముగియనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించడంతోపాటు రంగులు వేసే పనులు పూర్తికావచ్చాయి. నకిరేకల్ –తానంచర్ల 365బీ హైవేపై దర్గా వరకు ఉన్న ఫార్మేషన్ రోడ్డు నుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా రోడ్డును చదును చేయిస్తున్నారు. దర్గా చుట్టు పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఉర్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉర్సును విజయవంతం చేయాలని వక్ఫ్‌బోర్డు అధికారులు కోరుతున్నారు.



# పశుగ్రాసానికి భలే గిరాకీ

- కట్ట రూ.170 నుంచి రూ.190 వరకు..

త్రిపురారం, డిసెంబర్ 3 : మండల వ్యాప్తంగా పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. వరి కోతలు కోస్తున్న సమయంలో వర్షాలు పడటంతో పశు గ్రాసమంతా తడిసిపోయి నిల్వ చేసుకునే స్థితి లేకుండా పోయింది. దాంతో వరి గడ్డికి గిరాకీ పెరిగింది. ఇంతకుముందు కట్ట పశుగ్రాసం రూ.100 అమ్మేవారు. ఇప్పుడు రూ.170 నుంచి రూ.190కు అమ్ముతున్నారు. వేసవికాలంలో పంటలు పండుతాయో పండవో తెలియక పశువులు, గేదెలు ఉన్నవారు ముందస్తుగానే పశుగ్రాసాన్ని కొని నిల్వ చేసుకుంటున్నారు. ఈ ఐదేండ్లలో ఎన్నడూ లేని విధంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



జగదీశ్‌రెడ్డి కారు చుట్టూ చేరి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

# సూర్యాపేట నుంచి హ్యాట్రిక్ విజయం

- వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన జగదీశ్‌రెడ్డి
- రాజకీయ ఉద్దండులను ఓడించిన వైనం

సూర్యాపేట, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట నియోజకవర్గం నుంచి గతంలో వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన వారు ఎవరూ లేకపోగా, ఇప్పుడు ఆ ఘనత గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి దక్కింది. అంతేకాదు గతంలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఒకసారి ఎమ్మెల్యేగా పని చేసిన సంకినేని వెంకటేశ్వర్‌రావు లాంటి ఉద్దండులతో మూడుసార్లు పోటీపడి వారిని ఓడించడం గమనార్హం. మధ్య తరగతి కుటుంబం, పెద్దగా రాజకీయ చరిత్ర లేకపోయినప్పటికీ జగదీశ్‌రెడ్డి మాత్రం విద్యార్థి దశ నుంచే రాజకీయాలు వంట బట్టుకొని విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. తదనంతరం లా పూర్తి చేసి న్యాయవాది వృత్తి చేపట్టి 2001లో తెలంగాణ కోసం నాటి ఉద్యమ నేత కేసీఆర్‌తో కలిసి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జరిగిన మూడు ఎన్నికల్లో సూర్యాపేట నుంచి మూడుసార్లు గెలుపొందారు. 1952 నుంచి ఇప్పటి వరకు సూర్యాపేట నియెజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఏ ఒక్కరు కూడా గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించలేదు. అయితే 1952 నుంచి 1956, అలాగే 1962 నుంచి 1967, 1967 నుంచి 1972 వరకు మూడుసార్లు ఉప్పల మల్సూరు ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ వరుస విజయాలు కావు. అలాగే 1989 నుంచి 1999 వరకు రెండుసార్లు అంటే పదేండ్ల పాటు ఆకారపు సుదర్శన్ ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ ఇద్దరు కాకుండా మరెవరు కూడా రెండు టర్మ్‌ల్లో ఎమ్మెల్యేగా పనిచేయకపోగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాత్రం 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

# బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 3 : సూర్యాపేట నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గెలుపొందడంతో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. కౌంటింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారి చేతుల మీదుగా గెలుపు పత్రం అందుకుని బయటకు వచ్చిన జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వేలాదిగా చెరుకున్న గులాబీ శ్రేణులు దండుగా కదిలివచ్చి గజమాలతో సత్కరించి, పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.

అక్కడి నుంచి ప్రధాన వీధుల గుండా విజయోత్సవ ర్యాలీ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల ఆయన నివాసానికి చేరుకున్నది. అప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులతో సమీప వీధులన్నీ కిక్కిరిశాయి. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి వారికి అభివాదం చేస్తూ తన విజయంలో భాగస్వాములైన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# హరిత శోభితం.. ఆహ్లాద భరితం

హరితహారంలో భాగంగా తాడువాయి స్టేజీ నుంచి కలకోవకు వెళ్లే దారి వెంట నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులు, బాటసారులకు నీడనిస్తూ ఉపశమనం కలిగిస్తున్నాయి.

–మునగాల, డిసెంబర్ 3